# తాత

శ్రీ చావలి వెంకటశాస్త్రి

ఉన్నవూళ్ళోనే మనని పల్కరించేవాడు లేడే యిన్నివందలమైళ్ళదూరంలో యింత ఆప్యాయంగా పిల్చేవాడెవరాఅని వెనక్కి తిరిగి చూశాను నన్నుకాదేమోఅన్న అనుమానం కూడా కల్గింది" "మిమ్మల్నే రాండి" అన్నాడు.

వర్సగా రెండురోజులనుంచీ నిద్రలేదు ప్రయాణం బడలిక అమితంగా వుంది ఎవరన్నా తెల్సినవాడు దొరికితే బాగుండురా అనుకుంటుంటే ఎవరో కనిపెట్టినట్టుగా పిల్చారు

తను నన్ను చాలా దూరంనుంచే చూశాట్ట కాని యీ వేషంలో వుంటే నేను తెలుగువాణ్ణి కానేమోఅన్న అనుమానం వేసిందట తనకు. నాకు వాళ్ళ భాష రాకపోవటం గుర్తించి ధృవపర్చుకున్నాట్ట నేనెవరో.

అందులో నాది బెజవాడఅని చెప్పేప్పటికి ఆయనకు పట్టరానంత సంతోషం [illegible]గింది

తన యింటికి తీసుకెళ్ళాడు [illegible]చివరవాకద ఆయన యిల్లు చూట్టానికిమట్టుకు పురాతనవు యిల్లులాగా వుంటుంది నాలుగే గదులు కావాల్నని తనే అట్లా కట్టించాట్ట!

బయట నులకమంచంమీద కూర్చోమని తనోమారు యింట్లోకి వెళ్ళివచ్చాడు పాపం యింట్లో కూడా ఏమీ వస్తువుల్లేవు చాలా బీదవాడులాగా వున్నాడు

అయన్ని నేను తాతా అని పిలిచాను పేరు తెల్సుకోవల్సిన అగత్యం కనుపించలేదు పళ్ళన్నీ వూడిపోయినై వయస్సు అరవైఏళ్ళ పయిబడుంటుంది అనుమానంలేదు

నేను దేశం తిరిగివస్తున్నందుకు చాలా సంతోషించాడు తాత "చిన్నతనంలోనే అనుభవించాలి పెద్దయింతర్వాత ఏవీ చెయ్యలేం దేవుణ్ణి స్మరించటంతప్ప" అన్నాడు తాత బోసినోటితో నవ్వి తనూ చిన్నప్పుడు అమితంగా తిరిగేవాట్ట! నెలకోరోజు యింటిదగ్గరవుంటే మిగతారోజులు దేశంమీద తిరిగేవాట్ట! తను దేశంతిరిగి విజ్ఞానం ఎట్లా సంపాయించిందీ చెప్పాడు

తన నౌకర్ని పిల్చి వేణ్ణీళ్ళు ఏర్పాటు చెయించాడు నాకు ఆ రాత్రి పిండివంటలు ప్రత్యేకంగా చేయించి భోజనంపెట్టాడు చూట్టానికి ఎంతో బీదవాడిలాగా వున్నాడు తాతను అర్ధంచేసుకోవటంలో నేనే పొరబాటుపడ్డానని అనుకోవల్సి వచ్చింది.

భోజనాలయింతర్వాత యిద్దరమూ కూర్చున్నాం బయట వెన్నెట్లో తాత చుట్ట వెలిగించాడు పాపం ఉబ్బసం దగ్గుతో తాత చాలా అవస్తపడ్తున్నాడు అందులో యీ శీతాకాలం. మరీ బాధ!

"అయితే బెజవాడన్నమాట" అన్నాడు

"ఉ"

"చెప్పవూ మరి!"

తాత తన సంగతి చెప్పటం మొదలుపెట్టాడు తనదీ బెజవాడేట! యిక్కడికి వచ్చి పదేళ్ళయిందట తనకు నా అన్నవాళ్ళెవరూ లేరట! భార్యపోయి చాలా ఏళ్ళయిందట!

"మరిక్కడున్నారేం!"

"ఇక్కడ పొలాలు అఘోరించానుగా" అన్నాడు తాతకు దగ్గుతెరవచ్చి తెరపిచ్చింది

"మర్చిపోయినా నాగేశ్వర్రావుగారు బాగున్నారా"

"ఏ నాగేశ్వర్రావుగారు"

"విశ్వదాత"

"పోయినారు"

"అరె! ఎప్పుడూ"

చెప్పాను "నువ్వు చిన్నవాడివి అయన్ని గురించి నీకేం తెల్సు" అంటూ ఆయన్నిగురించి చాలా చెప్పాడు దేశం వదిలిపెట్టి పదేళ్ళయినా ఆయన్నిగురించిగాని యితర్లను గురించిగాని యింతగా చెప్పేప్పటికి తాత జ్ఞాపకశక్తికి ఆశ్చర్యమేసింది

తాత యింకా తనకు తెల్సినవాళ్ళనుగురించి అడిగాడు చెప్పాను రాత్రి రెండుగంటలదాకా అదీ యిదీ మాట్లాడుకున్నాం తాత చాలా కులాసాగా మాట్లాడాడు వయస్సులో ఎంతపెద్దవాడో చలాకీలో అంత చిన్నవాడు ఎంతో అనుభవం వున్న మనిషని చిటికెలో తేలిపోయింది

ఎందుకనో యిక్కణ్ణుంచా తాతలో ఓ మార్పు కనిపెట్టాను ఏదో అడగాలని ఆరాటం కాని అడగలేక పోతున్నాడు అడగాలా వద్దా అన్న తర్కం తాతముఖంలో స్పష్టంగా కన్పిస్తున్నది

ఉండీవుండీ "సీతనెరుగుదువా" అన్నాడు

"ఏ సీత"

"రామాయణంలో సీతగాదు"

"సుబ్బారావుగారి సీతా"

"మరె."

"తెల్సు"

"అవున్లే బెజవాడలో వుండి సీతను తెలీనివాడెవరుంటారు కనక!

ఎట్లావుంది"

"బాగానే వుంది చిత్రాంగిమాదిరిగా"

"మళ్ళా ఓమాటు చూడలని వుంది ఎప్పుడన్నా"

"అంటే"

అంతకన్నా తాత ఏవీ మాట్లాళ్ళేదు మళ్ళా దగ్గుతెర వచ్చింది తర్వాతకూడా ఏవీ మాట్లాళ్ళేదు ఎందుకు సీతనిగురించి అడిగాడో అర్ధంగాలేదు.

* * *

తెల్లవారేటప్పటికి తాత నాకంటె ముందరగానే లేచి వెళ్ళాడు కొత్తచోటు అని నాకోసం తన జీతగాణ్ణి వుంచాడు లేచి కాలకృత్యాలు తీర్చుకున్నాను

"ఆయనేడీ"

"పొలంవెళ్ళారు రోజూ తెల్లారకముందే వెళ్తాం యిద్దరమూ మీకోసంఅని నన్నిక్కడ వుండమన్నారు" అన్నాడు తాతనౌకరు

తాతయిల్లంతా చూశాను ఏం వుందీ! వంటకు మాత్రం కొద్దిగా సామానుంది అంతే! మరింకేవీ లేవు మొత్తంమీద ఆడదిక్కులేని సంసారం అని స్పష్టంగా తెలుస్తుంది!

"యిల్లన్నా మార్చగూడదూ"

"డబ్బంతా కూడబెడ్తున్నారు కొద్దిరోజుల్లో మన దేశం వస్తారు మళ్ళా"

"ఏం ఏమాత్రం పొలం వుందేం"

"చెప్పరు ఆయన వడ్డీమీదనే ఎంతో సంపాదిస్తారని అంటారు నిజం ఎవ్వరికీ తెలీదు ఆయన దృష్టిఅంతా మనదేశంమీదనే వుంటుంది ఎప్పుడూ"

తాతకు కొడుకులుగానీ మనమలుగానీ లేరట! ఎవరినుద్ధరిద్దామనో యిట్లా కూడబెట్టి యింకా తను ఎక్కువరోజులు కూడా బతకడాయెను! ఎందుకో యింత తృష్ణ. ఏంచేద్దామనో! "యీ గది చూడండి" అంటూ నౌకరు వంటయింటి పక్కగా తీసుకెళ్ళాడు

ఆ గది పెట్టెమాదిరిగా వుంది తాళంమీద తాళాలు వేసివున్నై

"ఏముందీ అందులో" అన్నాను

"వచ్చి పదేళ్ళయింది ఏమీ తెలీదు నేనింతవరకూ చూట్టానికి అవకాశం దొరకలేదు ఆయనమట్టుకు అర్ధరాత్రి వెళ్ళి ఆ గదిలో ఆ గాఢాంధకారంలో రోజూ అరగంటన్నా కూచుని వస్తాడు ఎంతో భద్రంగా తాళం వేస్తారు"

బయట సందుల్నుంచీ లోపలికి చూశాను. ఏవీ అగుపళ్ళేదు

యిద్దరమూ పొలానికని బయల్దేరాం

ఎదురుగ్గా వస్తున్నాడు తాత.

ముగ్గురమూ తిరిగి బయల్దేరాం తాత నా భుజాలమీద చేతులేసి ఎంతో చనువుతో మాట్లాడ్తూ వచ్చాడు

నౌకరు లేకుండా చూసి "ఓమాటు యిలారా' అని పొద్దున నౌకరు చూపించాడే ఆ గదిదగ్గరి!

తీసుకెళ్ళి అన్ని తాళాలూతీసి గది చూపించి అన్ని వస్తువులూ చెప్పటం మొదలుపెట్టాడు

అబ్బో! ఎన్నోరకాల చీరలు గాజులు బంగారపు వస్తువులు. మరీ ఒక పెట్టె చూపించాడు అందులో సందులేకుండా వున్నాయి వస్తువులు అన్నీ బంగారపువే!

ఇంకో పెట్టెమూత తీసేప్పటికీ సువాసన ఘుమాయించి కొట్టేది, గదినిండా బీరువాలూ అద్దాలూ వున్నయి అన్ని దేశాల నగ్నచిత్రాలూ

వెండిసామాను ఎంతోవుంది

చూసేప్పటికీ కళ్ళు జిగేలుమన్నయి మంత్ర ముగ్ధుడివలె చూస్తూవున్నాను మళ్ళా వెళ్ళి మామూలుచోట కూర్చున్నాం

''ఎవరికీ యివన్నీ?''

"నాకోసమే"—తాత బోసినోటితో నవ్వాడు

''సీతనెట్లా తెల్సు మీకు"—

''దానికోసమే యివన్నీ''

''ఛా''

''ఏం దాని అందానికి యివేం చాల్తయి" అన్నాడు తాత

లోపలికోమాటు వెళ్ళివచ్చి మళ్ళా తాత మొదలు పెట్టాడు ''నేను సీతను ప్రేమించాను" అన్నాడు. నవ్వొచ్చింది సీతది బజారురకం డబ్బుంటే ఎవణ్ణయినా సంతోషపెట్టుంది వచ్చి వాళ్ళో వాల్తుంది అట్లాంటివాళ్ళకు నీతేం వుంటుంది! అట్లాంటిదాన్ని యీ తాత ప్రేమించి దానికోసం యింత కూడబెట్టున్నాడంటె నవ్వురాక ఏమవుతుంది మరి!

మొదట్లో ఓమాటు సీతను వాళ్ళింట్లో చూశాను అబ్బా, ఏం చెప్పనూ ఆ అందం సీతను కొరికేద్దామా అనిపించింది యిది పశుత్వం అనుకుంటావేమో ముందు తెలిసొస్తుందిలే"

తాత చుట్ట వెలిగించాడు

''ఆ యింటి చుట్టూ నాలుగయిదు రోజులు సీతను చూద్దామని అదే పనిపెట్టుకొని తిరిగాను నేనూ దేశాలు తిరిగినవాణ్ణేకద! అల్లాంటి మనిషిని ఎప్పుడూ చూళ్ళేదు మొదటిసారి చూసినప్పుడు సీత మనిషేనా అనిపించింది చెప్పొద్దూ

మరి ఎట్లా కనిపెట్టిందో ఏవిటో సీత నా విషయాలు అన్నీ కనిపెట్టింది, నాకు కబురంపించింది నమ్మలేకపోయినాను వెళ్ళటానికి ధైర్యం చాల్లేదుకూడాను వెళ్ళాను ఎంతో మర్యాదగా పిల్చింది ఎందుకూ కట్టుకుంటామే యీ భార్యలకు నసపెట్టడంతప్ప ఏవీ తెలీదోయి

"ఎందుకూ యిట్లా తిరుగుతారు" అంది సీత. అప్పుడే చూడగలిగాను పూర్తిగా, అబ్బ! ఆ కళ్ళు సీతదృష్టిపడ్తే తప్పించుకోగలరా ఎవరైనా, స్మృతి చదువూ ఎత్తయినా అందాన్ని చ్చే పళ్లూ ఎందుకులే మనిషి పొట్లంలో యిముడ్తుంది. ...మాట్లాడేది స్త్రీతనే ...దైనా అంతేలే నవ్వుతున్నావా నాయనా ఎట్లా కనిపెట్టిందో ఏవిటో అదయినా నిర్భయంగా ''నాకోసమేనా" అంది ఎట్లాగయితే ఏం చెప్పాను సీతకు నా అభిప్రాయం ''అనుకున్నానే" అని నవ్వింది ఆ నవ్వు యిప్పటికీ

"పెళ్ళిచేసుకుంటారా" అంది ఒకటే నవ్వు ఎవడు వదిలిపెట్టాడోయి!

''మీకు నా సంగతి తెలీదు నేను ఫలానా అని తెలిస్తే యీ గడప తొక్కరు ఉండండి నా సంగతి చెప్తాను" అంది సీత

ఆపూట భోజనం అక్కడ్నే అందుకభ్యంతరం ఏం వుంది!

సీత నన్ను ప్రేమిస్తుందట! అయితే ఒక్క సంవత్సరమేనట! ఒకణ్ణి ఒక సంవత్సరం కన్న ఎక్కువ ప్రేమించలేదట రెండోఏడు యిద్దరికీ జీవితం నిస్సారంగా వుంటుందట తను అందర్లాగా మోసం చేయలేదట, తన సర్వస్వమూ యిస్తుందట నా సర్వస్వమూ యివ్వాలిట

సరే అంటే సరే అనుకున్నాం ఆస్తి అంతా నా సీతపేర వ్రాశాను ఎంతో సంతోషించింది చూస్కో మర్నాటినుంచీ మా కొత్త సంసారం మొదలయింది ఆ జీవితంలోని హాయి చెప్పటానికి వీల్లేదు రోజుకు యిరవైనాలుగు గంటలూ సౌఖ్యపడినవాళ్ళల్లో నేనూ ఒకణ్ణి! సీతకు నేను బానిస నాకు సీత బానిస బయట ప్రపంచంతో మాకు సంబంధం లేదు సీత చెక్కిలి తగిల్తే చాలదుటోయి జీవితం ధన్యం'

ఏమాట కామాటే! సీత నాఆస్తిని ధ్వంసం చెయ్యలేదు పొలం కొంత అమ్మాం అవసరమయినప్పుడు డబ్బువెదజల్లాం సీత నా ఆస్తిని తనేమీ అట్టేపెట్టుకోలేదు

సరిగ్గా రేపటితో సంవత్సరం అవుతుందనగా చెప్పింది నాకు సీత ఆమర్నాటినుంచి తనను తాకగూడదట తనింటి ముందర ఎన్నిరోజులుండి ఉపవాసంచేసినా లాభం వుండదట తను కన్నెత్తయినా చూడదట!

నాకు నిజంగా దిగులేసింది మర్నాటినుంచి జీవితం ఎట్లాగడుస్తుంది! ఎట్లాతోస్తుంది! దిగులు కలిగింది సీతతో ఏమీ మాట్లాళ్ళేకపోయినాను నాఆలోచనలు నాదిగులు అంతా సీత నిమిషంలో కనిపెట్టింది

" ఏం అట్లా అయినారు ?" అంది, ఏవీలేదు."

" ఆస్తిపోయిందన్న దిగులా, అమ్మ "

" ఛా ఛా "

సీతవచ్చి పక్కనకూర్చుంది సీతచెప్పింది తను ప్రతి సంవత్సరమూ ఒకరితో యిట్లా వుంటుందట! కాని చాలామంది ఏడ్చిపోతారట పాపం ఎన్నిఅన్నా ఎన్నికొట్టినా సీత ఏమీ అనదట అనసూయలాగా అతన్నే నమ్మివుంటుందట నన్నుమెచ్చుకుంది సీత యింతవరకూ నా అంత మంచివాణ్ణి తను చూళ్ళేదట! అందుకనే నా ఆస్తి జాగ్రత్తగావాడి సగంమిగిల్చి తిరిగియిచ్చింది నాకు వద్దన్నాను వింటేనా! మర్యాదగా ఒప్పించింది

ఆ రోజల్లా మా యిద్దరికీగూడ దిగులేసింది తెల్లవార్లూ నిద్రపోలేదు సీత కళ్ళనీళ్ళుపెట్టుకుంది ఎంతగానో వేడుకున్నాను నియమంతప్పటానికి వీల్లేదంది కాకపోతే అందరికంటె ఎక్కువగా మరో అవకాశం కల్గించింది అప్పట్నుంచీ పదేళ్ళ యింతర్వాత మళ్ళా రమ్మనమన్నది అప్పుడో సంవత్సరం తనదగ్గర వుండొచ్చుట, అయితే వెనుక నాకున్న ఆస్తికి నాలుగురెట్లు కావాలిట అందుకనే యీశ్రమ "

తాత యింతవరకూ తెరలాగావచ్చిన దగ్గు నాపుకుని చెప్పాడు యీసారి వచ్చిన తెరకు మట్టుకు తప్పుకోలేకపోయినాడు

ఆకషాన్నిచూస్తే తాత యింక కొద్దిరోజుల కంటె బతగ్గలడా అన్పించింది,

"అయిపోయింది జవసత్త్వాలుడిగి పోతున్నాయి నాయనా ఎంతయినా యీ రాక్షసిదగ్గు రాకుండా వుంటేనా! యింకోరెండ్నెల్లకు సీతపెట్టిన వ్యవధి అయిపోతుంది కొత్త సంవత్సరానికి బతికుంటే చాలు, బాగా వుండక్కర్లేదులే! సీతదగ్గరే భోజనం అందాకా నెమ్మదిగా వుంటే చాలు ఆ తర్వాత సీతదేభారం " అన్నాడు తాత

భోజనానికి లేచాం తాత ఎంతో వాత్సల్యంతో సత్కారం చేశాడు భోంచేస్తున్నంతసేపూ ఒకటే ఆలోచన, తాత బతగ్గలడా, సీతను చూడగలడా అని పాపం తాతకు వేరే కోర్కెల్లేవు యిక్కడ పొలం కొని తనే స్వయంగా పన్లు చూసుకుంటున్నాడు కావాల్సిన డబ్బు పూర్తయిందికూడా!

తాత నాలుగురోజులన్నా వుండమని బలవంత పెట్టాడు వేరే పన్లుండటంవల్ల ఆ సాయంత్రమే బయల్దేరాను ఎన్నడూ దేవుడికి చెయ్యెత్తి దణ్ణంపెట్టనివాణ్ణి అయినా నాకు తెలీకుండా తాతకు యింకో సంవత్సరం అన్నా ఆయుస్సు యివ్వమని దేవుణ్ణి ప్రార్థించాను

**(ఓ ఫ్రెంచి కథలోని భావాన్ని అనుసరించి)**